క్లుప్తంగా

వేడుకగా నరసింహుని కల్యాణం



మద్దిలేటి నరసింహస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో పాల్గుణ మాస బహుళ సప్తమి శుక్రవారం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నమస్మరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు.

దాత ఔదార్యం



తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలో మంచి నీటి సరఫరా చేసే పైపులైన్ పగిలిపోవడంతో ఐదు రోజుల నుంచి కాలనీలకు నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రాథమిక పాఠశాల నుంచి వెర్రిగోవిందస్వామి ఆలయ సమీపంలోని కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన శేషఫణి స్వామి కిలోమీటర్ దూరంలో ఉన్న పొలంలో ఉన్న బోరు నుంచి ఇంటి వరకు పైపులైన్ ఏర్పాటు చేసుకున్నాడు. కాలనీ వాసులు నీటి సరఫరా అందించాలని కోరడంతో ఆయన మానవతా దృక్పథంతో రెండు రోజుల నుంచి నీటిని అందిస్తున్నాడు. వేసవి కావడంతో మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. దాత ఔదార్యంతో కాలనీల ప్రజలకు కొంత మేర నీటి కష్టాలు తప్పాయి.

వేలం పాట వాయిదా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

డోన్: మున్సిపల్ పరిధిలో శుక్రవారం జరగాల్సిన దిన, వారపు సంతలు, బస్టాండ్, జంతువధశాలల వేలం పాటలు వాయిదా పడినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. ధరావత్తు సొమ్ము అధికంగా ఉందనే కారణంతో కాంట్రాక్టర్లు వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదన్నారు. ఈ నెల 28వ తేదీ తిరిగి వేలం పాటలు నిర్వహిస్తామన్నారు.

గోశాలకు ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

డోన్ టౌన్: దాతల ఆర్థిక సహకారంతో సేకరించిన రూ.15వేల విలువ చేసే ఏడు ఫ్యాన్లను స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు అనంతపురం జిల్లా గుత్తి మండలం మార్నేపల్లి గ్రామంలోని రిషి ప్రకృతి గోవనం నిర్వాహకురాలు డాక్టర్ మాధవికి శుక్రవారం అందజేశారు. గోసేవ అత్యంత పుణ్య ఫలం అని, గోవులకు సేవ చేయడం సకల దేవతలకు పూజలు చేసిన ఫలంతో సమానం అన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మధు, రాము, మోహన్‌రెడ్డి, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శివరామకృష్ణ

డోన్ రూరల్: అరటి పంట సాగులో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని అరటి పరిశోధన స్థానం పులివెందుల ప్రిన్సిపల్ సైంటిస్ట్ శివరామకృష్ణ తెలిపారు. పట్టణంలోని షాదీఖానలో శుక్రవారం జిల్లా స్థాయి అరటి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. అరటి పంటలకు అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి మంచి దిగుబడి సాధించాలని సూచించారు. హార్టికల్చర్ అధికారి కళ్యాణి, ఆత్మకూరు ఉద్యాన అధికారులు చందన, రఘువరన్ పాల్గొన్నారు.

డోన్ సబ్‌డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్

డోన్ టౌన్: డోన్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె మండలాల్లో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని.. ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని డీఎస్పీ కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసినట్లు టౌన్ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా ర్యాలీలు, ధర్నాలు చేయాలనుకుంటే డీఎస్పీ నుంచి లిఖిత పూర్వక అనుమతి తీసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- వేసవి ప్రారంభంలోనే భానుడి భగభగలు
- రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న ప్రజలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు

సుర్రుమంటున్న సూరీడు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన అవుకు ప్రధాన రహదారి

అవుకు: మార్చి నెలలోనే భానుడు భగభగమంటూ జనాలను బెంబేలెత్తిస్తున్నాడు. రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అడుగు తీసి బయట పెట్టేందుకు జంకుతున్నారు. ఇక పగటి పూట ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ప్రస్తుతం అవుకు మండలంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకుంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో సూర్య ప్రతాపం ఇంకెంతలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆహారం, నీటి విషయంతో పాటు దినసరి కూలీ పనులకు వెళ్లే సమయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా మనిషి శరీరంలో తేమ(నీటి) శాతం ఉండాల్సిన దానికన్నా తగ్గకుండా చూసుకోవాలని అంటున్నారు.

వడదెబ్బ లక్షణాలు.. ప్రథమ చికిత్స

ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. తలనొప్పి, మైకం, వికారం, వాంతులు, వేగంగా గుండె కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు రావడం, చర్మం ఎర్రబడటం, పొడిబారడం, స్పృహ కోల్పోవడం, కండరాల నొప్పి, తిమ్మిర్లు రావడం, నీరసం వంటి లక్షణాలు వడదెబ్బకు సూచనలు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటితో తుడవాలి. చల్లని గాలి తగిలేలా చూడాలి. చల్లని నీరు లేదా ఉప్పు, ఓఆర్ఎస్ కలిపిన ద్రావణాన్ని తాగించాలి. ఒకవేళ పూర్తి అపస్మారక స్థితిలో ఉంటే వెంటనే దగ్గరలోని వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

అతిసారం ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవిలో సాధారణంగా అతిసారం ఎక్కువగా ప్రబలుతుంది.
- సురక్షితమైన నీటిని కాచి చల్లార్చి వడబోసి తాగాలి.
- బావులు, బోర్లు, చెరువు, కాలువల నీటిని క్లోరినేషన్ తర్వాతనే ఉపయోగించాలి.
- తాగునీటిని పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వచేసి, పాత్రలపై మూతలు పెట్టాలి.
- వంట గదిలో పండ్లు, కూరగాయలపై దుమ్ము, ధూళి, ఈగలు వాలకుండా చూసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.
- వేడిగా, తాజాగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి.
- ప్రతి రోజూ మరుగుదొడ్లను శుభ్రం చేసుకోవాలి.
- మల, మూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.

అతిసారం లక్షణాలు కనిపిస్తే..

అతిసారం గురైన వ్యక్తికి ఎక్కువగా విరేచనాలు అవుతాయి. వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతుంటే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని, ఇంటిలో లభించే గంజి, పలుచని మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగించాలి. రోజులో ఒకటి లేక నాలుగు సార్లు నీళ్లతో కూడిన విరేచనాలైతే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యున్ని సంప్రదించి తగిన చికిత్స పొందాలి. అలాగే చిన్నారులకు విరేచనాలు అవుతుంటే ఎక్కువశాతం తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇస్తూ ఉండాలి. లేదంటే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

గడిచిన వారంలో ఉష్ణోగ్రతల వివరాలు (అవుకు)

తేదీ	ఉష్ణోగ్రత (సెల్సియస్)
21	39
20	39
19	39
18	40
17	38
16	37

జాగ్రత్తలు తప్పనిసరి

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ఎండలో తిరగకుండా ఉండడం ఉత్తమం. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా పండ్ల రసాలు తాగి వెళ్లాలి. బయటకు వెళ్లే సమయంలో తెల్లని దుస్తులు ధరించాలి. వేసవిలో మద్యం సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దారి తీస్తుంది. ఇంటిలో ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కిటికీలు, తలుపులకు తెరలను వాడాలి. ఎండలో వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు, టోపీ, తలపాగా వంటివి ధరించాలి. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఎండలో బయటకు రాకపోవడమే మంచిది. పిల్లలను ఎక్కువసేపు ఎండలో ఆడనీవకూడదు.

డీహైడ్రేషన్ కేసులు నమోదవుతున్నాయి



జీవనం సాగించడం కోసం ప్రజలు రోజువారీ కూలి, ఇతరత్రా పనులకు వెళ్తున్నారు. అయితే ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకుని పనులు చేసుకోవాలి. ఇప్పటికే అవుకు సీహెచ్‌సీలో డీహైడ్రేషన్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. చికిత్స చేస్తున్నాం. అవుకు సీహెచ్‌సీలో తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. –డాక్టర్ అభినయ్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, అవుకు

నిర్లక్ష్యం చేయొద్దు



ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ లక్షణాలుంటే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. వేసవి కాలంలో సాధ్యమైనంత వరకు అధికంగా మంచినీరు తాగుతూ ఉండాలి. –డాక్టర్ యమున, వైద్యురాలు, ఉప్పలపాడు పీహెచ్‌సీ

నిరుద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

కోవెలకుంట్ల: ఎన్నికల సమయంలో కూటమి నేతలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. గత ఏడాదే డీఎస్సీ నిర్వహించాల్సి ఉండగా ఈ ఏడాదికి వాయిదా వేశారని తెలిపారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 3 వేలు భృతి చెల్లిస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. గ్రూప్ -1, 2 పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ సాకుతో అన్ని రకాల ఉద్యోగాలను భర్తీ చేయకుండా వాయిదా వేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉన్నప్పటికీ పక్క రాష్ట్రమైన తెలంగాణాలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య రానీయొద్దు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పాదుపు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న చేతి పంపులను మరమ్మతులు చేయించాలని, పైప్‌లైన్ లీకేజీలు సరిచేయించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను మంత్రి బీసీకి వివరించారు. వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించగా, విద్యుత్ ఏఈలు గర్జప్ప, శ్రీనివాసులు వేసవి కాలంలో విద్యుత్ సరఫరాపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. మండల సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని పలువురు అధికారులకు నోటీసులు ఇవ్వాలని మంత్రి ఎంపీడీఓ బీవీ రమణను ఆదేశించారు. మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఈఏ సాయికృష్ణ, పీఆర్ డీఈ నాగశ్రీనివాసులు, ఈఓఆర్డీ సతీష్ కుమార్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణ, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, ఎస్‌ఆర్‌జీఎస్ ఏపీఓ రేష్మా, ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు గో ఐశ్వర్యంపై శిక్షణ

డోన్: మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో ఈ నెల 23వ తేదీ గో ఐశ్వర్యం పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీపతి యువరాజు, రాజేశ్వరరెడ్డి తెలిపారు. గోవనం ట్రస్టు ఆధ్వర్యంలో భగవాన్ సద్గురు సేవా సంస్థ ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఆవు ద్వారా ఆనందం, ఆరోగ్యం, ఆదాయం ఎలా పొందవచ్చు అనే అంశంపై ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 9611063556, 6305283131 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

బనగానపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు దస్తగిరి అన్నారు. శుక్రవారం బనగానపల్లెలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వర్గీకరణతో దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రగా పేర్కొన్నారు. వర్గీకరణను నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు, నాయకులు రామసుబ్బయ్య, సత్యం, శివుడు, ప్రసాదు, ఓబన్న పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణ అంశంపై కేబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాముల అబ్రహం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కలిసి మెలిసి ఉన్న మాలమాదిగలను విడదీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. రాజకీయ నాయకులు వారి పబ్బం గడుపుకునేందుకు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మురుగు కష్టాలు



మురుగునీటిలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: పాఠశాలకు రాకపోకలు సాగించేందుకు విద్యార్థులకు మురుగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాలకు చేరుకోవాలంటే సీసీ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్నాయి. విద్యార్థులు అష్టకష్టాలు పడి నడిచి వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు మురుగు నీటిలో కిందపడిన సందర్భాలు ఉన్నాయి. విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు జారి పడుతుండడంతో వేరే మార్గం ద్వారా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఎగువన కాలనీలు ఉండడంతో మురుగునీరంతా కిందకు వస్తుంటాయి. కాల్వలు చిన్నగా మారడం, చెత్తచెదారంతో పూడిపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని సీసీరోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా కాల్వలు వెడల్పు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు, కాలనీ వాసులు కోరుతున్నారు.

ఇన్విజిలేటర్లకు ఐడీ కార్డు తప్పనిసరి

బేతంచెర్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధులకు హాజరయ్యే ఇన్విజిలేటర్లు తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించాలని నంద్యాల డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిమెంట్ నగర్ ఏపీ మోడల్ స్కూల్, పట్టణంలోని సుమేధా, సెంట్ ఆన్స్, గ్రేస్ స్కూల్లో జరుగుతున్న 10వ తరగతి ఇంగ్లిష్ పరీక్షను ఆయన తనిఖీ చేశారు. ఇన్విజిలేటర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

ప్యాపిలి: ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం కింద నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ ఉప కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం జలదుర్గం పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం స్కీం ఏర్పడి 20 ఏళ్లు అయినప్పటికీ కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ నాయకులు మధు, ఆశా వర్కర్లు కృష్ణవేణి, పుల్లమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబీదా బేగం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఇందులో అనాథ పిల్లలు, బడిబయట పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీహెచ్‌సీకి గైనకాలజిస్ట్ నియామకం

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు గైనకాలజిస్టును నియమించడంతో శుక్రవారం డాక్టర్ సుజాత విధుల్లో చేరారు. కొంత కాలం నుంచి సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న సుజాతను ఇక్కడికి బదిలీ చేశారు. డాక్టర్ నియామకంతో మహిళా రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

మంచినీటి సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలో శని, ఆదివారాల్లో (22,23 తేదీలు) మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డోన్‌లో 1500 కేఎల్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే 400 ఎంఎం పైప్‌లైన్ వైఎస్ నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ సమీపంలో లీకేజీ కారణంగా చిగురమానుపేటలోని 1,500 ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌కు నీటి పంపింగ్ నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దీని కారణంగా 12,13,14,15,16, 17వ వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి 24వ తేదీ నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



పేరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న మహేష్‌కుమార్

డోన్ టౌన్: అంకిత భావంతో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందాలని హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, డీఎస్పీ కేవీవీఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన హోంగార్డు పెరేడ్‌ను ఆయన పరిశీలించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. అనంతరం డోన్ సబ్ డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన రామయ్య, శివయ్య, అనిత, గోపికృష్ణ, రామ్మూర్తికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పశు బీమా.. పాడి రైతుకు ధీమా



రైతులతో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు మారుతీ సకారం

అవుకు: పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు మారుతీ సకారం అన్నారు. మండల పరిధిలోని శివవరం గ్రామంలో జరుగుతున్న గాలికుంటు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రూ.15 వేల బీమాకు రూ.960 ప్రీమియం ఉండగా ప్రభుత్వ సబ్సిడీ రూ.768 పోను రైతులు రూ.199 చెల్లించాలని తెలిపారు. అలాగే రూ.30వేల బీమాకు సబ్సిడీ పోను రూ.398, రూ.35 వేల బీమాకు రూ.729, రూ.40 వేల బీమాకు రూ.1060, రూ.45వేల బీమాకు రూ.1392, రూ.50వేల బీమాకు సబ్సిడీ పోను రూ.1723 రైతులు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఒకసారి బీమా చేయించుకుంటే 3 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. సందేహాలు ఉంటే ఆయా గ్రామాల్లోని ఏహెచ్‌ఏలను సంప్రదించాలని సూచించారు. అవుకు పశువైద్యురాలు భారతీదేవి, సిబ్బంది రాజేష్, భార్గవి పాల్గొన్నారు.

అప్పారి వెంకటస్వామికి నివాళి



బనగానపల్లె: అప్పారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



డోన్‌లో..

బనగానపల్లె రూరల్: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా బనగానపల్లెల్లోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం నివాళులర్పించారు. సంఘం జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాష్, ఆడిట్ కన్వీనర్ దస్తగిరి మాట్లాడుతూ.. అప్పారి వెంకటస్వామి ఉపాధ్యాయ సంఘం కోసం తన కుటుంబాన్ని, తన 15 ఏళ్ల సర్వీసును వదులుకున్నారని కొనియాడారు. ఆయన జీవితాన్ని ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయకులు ప్రతాప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డోన్ టౌన్: యూటీఎఫ్ మాజీ గౌరవ అధ్యక్షుడు నరసింహులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి ఆధ్వర్యంలో యూటీఎఫ్ నాయకులు డోన్ కార్యాలయంలో అప్పారి చిత్రపటానికి నివాళులర్పించారు.

చిన్నారుల్లో సామర్థ్యాలను అంచనా వేయాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు

కోవెలకుంట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న ఆరేళ్లలోపు చిన్నారుల సామర్థ్యాలను అంచనా వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రమ్మ, జమీలా సూచించారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు వివిధ పోషకాలతో కూడిన ఆహారం, ప్రతి రోజు ఉడికించిన గుడ్డు అందజేయాలన్నారు.

సంక్షిప్తం



ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవా శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మ వారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలను అలంకరించి పల్లకీ సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలులో విఫలమైందని ఏపీ స్టూడెంట్ ఫెడరేషన నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 9 నెలలైనా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం హామీలు అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.

దద్దణాల ప్రాజెక్టు నుంచి సాగునీరందించాలి

బనగానపల్లె రూరల్: మండలంలోని దద్దణాల ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, మండల రైతు సంఘం నాయకుడు సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దద్దణాల ప్రాజెక్టు నీరు జ్వాలాపురం, పాతపాడు ప్రాంతాల్లో గుంతలు తీయడం వల్ల చివర ఉన్న పొలాలకు నీరందడం లేదని, కోత దశలో ఉన్న పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు.